క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం ఈఓ, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

వైభవంగా సుంకులా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ



నూతన ఆలయంలో ప్రతిష్ఠించిన సుంకులా పరమేశ్వరి అమ్మవారు

పగిడ్యాల: మండలంలోని కొత్త పాలమర్రి గ్రామంలో గురువారం సుంకుల పరమేశ్వరీ జీర్ణోద్ధరణ పూర్వక నూతన దేవాలయ, విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం 8.45 గంటలకు పురోహితులు అనిల్‌స్వామి ప్రాతఃకాల పూజ, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, బింబ కళాన్యాసం, కూశ్మండ ఛేదనం, కక్షాగ్నిజ్వాల, దర్శనం, మంగళహారతి, బలిదానం, మహాపూర్ణాహుతి, కలశోధక, యజమాన మార్జనం, తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవతా విగ్రహాలను గ్రామ పురవీధుల గుండా ఊరేగించిన అనంతరం ఆలయంలో ప్రతిష్ఠించారు. నూతన ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారికి గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

క్రికెట్ టోర్నీకి విశేష స్పందన



నంద్యాల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కిట్లను పంపిణీ చేస్తున్న శిల్పా కార్తీక్‌రెడ్డి

ఆత్మకూరు: పట్టణంలో వచ్చే ఏడాది జనవరి 6న నిర్వహించే శ్రీశైలం నియోజకవర్గం స్థాయి క్రికెట్ పోటీలకు విశేష స్పందన లభిస్తున్నట్లు శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి తెలిపారు. టోర్నీకి పేర్లు నమోదు చేసుకున్న జట్లకు గురువారం నంద్యాల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పెద్ద ఎత్తున క్రీడాకారులు నమోదు చేసుకుంటూ క్రీడల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు

నందికొట్కూరు: కర్నూలు–నందికొట్కూరు మార్గంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికులకు లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపికచేసి ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు.. గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల మధ్య డిప్ తీశారు. మొదటి బహుమతి శ్రావ్య, రెండోవ బహుమతి కర్నూలు వాసి వెంకటేశ్వర్లు, మూడో బహుమతి శివలక్ష్మిలకు దక్కాయి.కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్షలు

ఆత్మకూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్ చేపట్టిన నిరసన కార్యక్రమాలు గురువారం కొనసాగించారు. అంగన్‌వాడీ హెల్పర్స్ ,వర్కర్స్ యునియన్ నాయకురాల్లు మంజుల, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి బయల్దేరి పోస్టాఫీస్ వరకు ర్యాలీ చేపట్టారు. అక్కట సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పోస్టుకార్డులు పంపి నిరసన వ్యక్తం చేశారు.

శ్రీశైలంప్రాజెక్ట్: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తలపెట్టిన నిరవదిక నిరాహార దీక్షలు గురువారం 17 వ రోజుకు చేరుకున్నాయి. సున్నిపెంట గ్రామంలో శ్రీశైలం మండల అంగన్‌వాడీ ఆయాలు , కార్యకర్తలు అంబేడ్కర్ సెంటర్‌లో తమ దీక్షలను కొనసాగిస్తున్నారు. గురువారం పోస్టుకార్డులను చేతపట్టుకుని తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. దీక్షలకు ఏఐటీయూసీ కార్మిక సంఘం తమ మద్దతు తెలిపింది.

తీరనున్న ప్రయాణ కష్టాలు

- తూడిచెర్ల – పారుమంచాల రోడ్డును పట్టించుకోని గత ప్రభుత్వం
- గుంతల మయంగా మారిన వైనం
- రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- శరవేగంగా సాగుతున్న పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు, వాహనదారులు

ఇది కదా అభివృద్ధి



నాడు అధ్వానంగా ఉన్న పారుమంచాల-తూడిచెర్ల రోడ్డు



నేడు ముమ్మరంగా కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు



రోడ్డును చదును చేస్తున్న జేసీబీ

జూపాడుబంగ్లా: తూడిచెర్ల-పారుమంచాల రోడ్డును టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గుంతలమయంగా మారింది. పదేళ్లుగా అతుకులు, గతుకులమయంగా మారిన రోడ్డుపై ప్రయాణించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. కేవలం ఏడు కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఆటోలు కూడా తిరిగేవి కావు. ద్విచక్రవాహనాలు, ఆర్టీసీ బస్సులు మాత్రమే తిరిగేవి. ప్రజల కష్టాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పారుమంచాల నుంచి తూడిచెర్ల మీదుగా మద్దూరు వరకు బీటీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో ఆయా గ్రామాలప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.4.8 కోట్లు మంజూరు

గుంతలమయమైన రోడ్డులో ఏడు కిలోమీటర్ల దూరం ప్రయాణించాలంటే కనీసం 45 నిమిషాల సమయం పట్టేది. ప్రజాప్రతినిధుల ద్వారా పారుమంచాల–తూడిచెర్ల రోడ్డు దుస్థితిని తెలుసుకొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారుమంచాల నుంచి తూడిచెర్ల మీదుగా మద్దూరు వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.4.8కోట్ల ట్రిపుల్‌ఆర్ గ్రాంటు కింద నిధులు మంజూరు చేయడంతో ప్రస్తుతం రోడ్డు నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 2024 ఫిబ్రవరి నెలాఖరులోగా రోడ్డు నిర్మాణం పనులు పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తేనున్నట్లు అధికారులు వెల్లడించటంతో ప్రయాణికులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా కేంద్రానికి దగ్గరిదారి

జూపాడుబంగ్లా, పాములపాడు మండలాల ప్రజలు జిల్లా కేంద్రం నంద్యాలకు చేరుకునేందుకు ఇది దగ్గరిదారి. నందికొట్కూరు నుంచి కూడా ఈ మార్గం గుండా వెళ్తే దాదాపు 10కిలో మీటర్ల ప్రయాణం తగ్గుతుంది. ప్రస్తుత నంద్యాల డిపోకు చెందిన బస్సు పారుమంచాల, తూడిచెర్ల, వాడాల మీదుగా నందికొట్కూరుకు రాకపోకలు సాగిస్తోంది. రహదారి నిర్మాణ పూర్తియితే సంద్యాల వెళ్లేందుకు సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుంది. రోడ్డు సక్రమంగా లేని కారణంగా నందికొట్కూరు నుంచి తూడిచెర్ల, వాడాలకు వెళ్లే ప్రయాణికులు పాములపాడుకు చేరుకొని అక్కడి నుంచి వెళ్లేవారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ప్రస్తుతం పారుమంచాల నుంచి తూడిచెర్ల మీదుగా మద్దూరు వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణం పనులు జరుగుతుండటంతో మరో రెండు మాసాల్లో ప్రజల కష్టాలు తీరి సాఫీగా ప్రయాణం చేసే అవకాశాలుండటంతో ప్రయాణికులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు పూర్తయితే ఇబ్బందులుండవు



నేను ఫర్టిలైజర్ వ్యాపారం చేస్తుంటాను. మా ఊరి నుంచి నందికొట్కూరు, జూపాడుబంగ్లాకు నిత్యం ఒకసారైనా బైక్‌పై వెళ్లొస్తుంటా. రోడ్డు సక్రమంగా లేకపోవటంతో గుంతలమయంగా ఉన్న రోడ్డు మీద వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ప్రస్తుతం నూతన రోడ్డు నిర్మిస్తుండటంతో నాతో పాటు ప్రయాణికులు కష్టాలు తీరనున్నాయి.

– దొడ్డా సుధాకర్, తూడిచెర్ల

నూతన రోడ్డు నిర్మించడం సంతోషం



పదేళ్ల తర్వాత పారుమంచాల నుంచి తూడిచెర్ల మీదుగా మద్దూరు వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టడం సంతోషంగా ఉంది. రోడ్డు బాగలేకపోవడంతో ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తూడిచెర్లకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. కనీసం ఆటోలు కూడా తిరిగేవి కావు. రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రయాణం సాఫీగా సాగుతుంది.

– ప్రకాశం, సర్పంచ్, పారుమంచాల

3 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ఆత్మకూరు: పట్టణంలోని అన్ని సచివాలయాల పరిధిలో జనవరి 3వ తేదీ నుంచి మార్చి 27వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్–2 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. జనవరి 3న జిల్లా పరిషత్ హైస్కూల్ మెయిన్ బజార్, 10న నవభారత్‌స్కూల్, 17న మార్కెట్‌యార్డ్, 24న గవర్నమెంట్ హైస్కూల్, 31న జిల్లా పరిషత్ హైస్కూల్, ఫిబ్రవరి 7న ఎంపీడీఓ కార్యాలయం, 14న నవభారత్‌స్కూల్, 21న ఎస్టీ హాస్టల్ అర్బన్ కాలనీ, 28న బాలికల ఉన్నత పాఠశాల, మార్చి 6న నలందా పాఠశాల, 13న పుల్లారెడ్డి స్కూల్, 20న ఎస్టీ హాస్టల్, 27న ఉర్దూ పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని రోగులు చికిత్స నిర్వహించుకోవాలన్నారు. ఒక్కో సచివాలయం పరిధిలో 7 రోజులు వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు.

పాములపాడులో రెండో విడత

పాములపాడు: 2024 జనవరి 9వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ గురువారం తెలిపారు. జనవరి 9న మద్దూరు, 23న జూటూరు, 30న భానుముక్కల, ఫిబ్రవరి 6న వేంపెంట, 13న బానకచెర్ల, 20న యర్రగూడూరు, 27న చెలిమిల్ల, మార్చి 5న ఇస్కాల, 12న మిట్టకందాల, 19న రుద్రవరం, 26న తుమ్మలూరు, ఏప్రిల్ 2న వానాలలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

జూపాడుబంగ్లాలో జనవరి 12 నుంచి..

జూపాడుబంగ్లా: 2024 జనవరి 12 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. జనవరి 12న జూపాడుబంగ్లా–2 సచివాలయం, 19న పారుమంచాల, ఫిబ్రవరి 02న 80బన్నూరు, 09న తంగడంచ, 16న మండ్లెం–2, 23న తర్తూరు, మార్చి 01న తరిగోపుల, 15న తాటిపాడు, 22న తూడిచెర్ల, 30న మండ్లెం–1 సచివాలయాల పరిధిలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

ఆరోగ్య శ్రీతో ఉచితంగా కార్పొరేట్ వైద్యం

- రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పరిమితి పెంపు
- లబ్ధిదారులకు నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ
- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కొత్తకార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి

కొత్తపల్లి: ఆరోగ్య శ్రీతో పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. పేదల ఆరోగ్యం కోసం మహానేత వైఎస్సార్ ప్రవేశ పెట్టిన ఈ పథకానికి ఆయన తనయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత మెరుగుపరిచాయరన్నారు. గురువారం మండలంలోని పెద్దగుమ్మడాపురం సచివాలయం వద్ద ఎర్రమఠం, గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో లబ్ధిదారులకు కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజలకోసం ఆరోగ్య శ్రీ పథకం ఏర్పాటు చేసి రూ.5 లక్షల వరకు వైద్య ఖర్చులు వర్తింపజేశారన్నారు. తండ్రి బాటలోనే తనయుడు ఆ వైద్య ఖర్చుల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచడం సుభసూచకమన్నారు. ఇదివరకు ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాలలో క్యాంపులు ఏర్పాటు చేసి కంటి ఆపరేషన్లు, ఉచిత మందుల పంపిణీ, ఇతర వ్యాధులకు ఉచిత వైద్యం అందించారని చెప్పారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఏ ప్రభుత్వం చేయని బృహత్తర కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమల సుధకార్‌రెడ్డి, వైద్యాధికారులు షబ్బీర్, విజయేంద్ర, ఎంపీడీఓ మేరి, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, సర్పంచు సక్క విజయ్‌కుమార్, ఉపసర్పంచు బొల్లు శ్రీనివాసులు యాదవ్, జగనన్న ఇళ్లస్థలాల మండల కో – ఆర్డీనేటర్ పరశురాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు జె.రాము, మల్లయ్య, జీఎండీ రఫీ, శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: బడిఈడు పిల్లలను దుకాణాలు, మెకానిక్‌షెడ్లల్లో పనికి పెట్టుకోవడం చట్టరీత్యానేరమని ఎంఈఓ–1 చిన్నమద్దిలేటి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలంటూ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 5 నుంచి 18 ఏళ్లలోపు బాల, బాలికలు తప్పనిసరిగా బడిలోనే ఉండేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులపై ఉందన్నారు. అలాకాదని విద్యార్థులను బాలకార్మికులుగా మార్చితే ఉపేక్షించేదిలేదన్నారు. మండలం వ్యాప్తంగా 391మంది లాంగ్‌ఆబ్‌సెంట్ విద్యార్థులుండగా వారిలో చాలావరకు తల్లిదండ్రులతో మాట్లాడి బడిలో చేర్పించినట్లు తెలిపారు. మిగిలిన విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సత్వరమే వారి పిల్లలను బడికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏవో పవన్ కుమార్

వెలుగోడు: కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి పవన్‌కుమార్ బ్యాంకర్ల కోరారు. గురువారం లీడ్ బ్యాంకు బ్యాంకర్స్ కమిటీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. కౌలు రైతులకు వెన్నుదన్నుగా నిలవాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. గడచిన నాలుగేళ్ల కంటే మిన్నగా ఈ ఏడాది కౌలు కార్డులు (పంట హక్కు సాగు పత్రాలు–సీసీఆర్సీ) జారీ చేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి కౌలు రైతుకూ పంట రుణాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. రైతులు రబీలో సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో బ్యాంక్ మేనేజర్లు సత్యనారాయణ, రామకృష్ణ, చెన్నకేశవులు, ఐపీఓ చంద్రశేఖర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా పైప్‌లైన్ పనులు



మెయిన్‌రోడ్డు వెంట మార్కింగ్ వేయిస్తున్న ఏపీఐఐసీ జిల్లా మేనేజర్ కృష్ణమోహన్‌రావు

పగిడ్యాల: ఓర్వకల్లు మెగా పారిశ్రామిక హబ్ అభివృద్ధి కోసం రూ.300 కోట్ల వ్యయంతో చేపట్టిన నీటి పైప్‌లైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, పనులను సకాలంలో పూర్తి చేస్తామని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం కొత్త ముచ్చుమర్రి మెయిన్ రోడ్డు వెంట పైప్‌లైన్ పనులకు మార్కింగ్ ఇవ్వడానికి వచ్చారు. కాగా, గ్రామస్తులు పలు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. మెయిన్‌రోడ్డు వెంట కాకుండా గ్రామ శివారు ప్రాంతం ఎస్సీ కాలనీ నుంచి నెహ్రూనగర్ మెటల్ రోడ్డు ద్వారా కేసీ కెనాల్ వరకు పైప్‌లైన్ పనులు చేపట్టాలని సూచించారు. గ్రామస్తుల వెల్లడించిన అభ్యంతరం మేరకు ఏపీఐఐసీ అధికారులు తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ వెంకటరమణ, ఎస్ఐ నాగార్జున సమక్షంలో శివారు ప్రాంతాన్ని పరిశీలించారు. జోనల్ మేనేజర్ మాట్లాడుతూ గార్గేయపూరం- పూడిచెర్ల మధ్య కూడా పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. 55 కి.మీ మేరకు జరిగే పైప్‌లైన్ పనుల్లో ఇప్పటి వరకు 20 శాతం మేరకు పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. 2024 చివరి కల్లా పైప్‌లైన్ పనులు పూర్తవుతాయని వెల్లడించారు. గ్రామస్తులు తెలిపిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని సాధ్యసాధ్యాలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో కేఎల్ఎస్ఆర్ కంపెనీ కాంట్రాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు జావేద్, కాసీం సాహెబ్, వీఆర్వోలు నరసింహులు, మద్దిలేటి గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

వర్షితకు సన్మానం



వర్షితను సన్మానిస్తున్న సర్పంచ్, ఎంపీడీఓ, నాయకులు

మహానంది: బ్యాంకాక్‌లో జరిగిన జంప్ రోప్ థాయ్‌ల్యాండ్ పోటీల్లో పాల్గొని స్వగ్రామానికి వచ్చిన చెవుల చిన్న వెంకటరమణ, ఓబులమ్మల కుమార్తె చెవుల వర్షితను గ్రామస్తులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ మేరకు ఎంపీడీఓ శివనాగజ్యోతి, గ్రామ సర్పంచ్ వంకె సుదర్శనం, సొసైటీ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, డాక్టర్ వెంకటరెడ్డిలు వర్షితను అభినందించారు. థాయ్‌లాండ్‌లో జరిగిన పోటీల్లో ఇండియా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందని, వచ్చే ఏప్రిల్‌లో జపాన్‌లో జరిగే పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

చెంచులకు పక్కాగృహాలు



సమావేశం నిర్వహిస్తున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: చెంచు గిరిజనుల సొంతింటి కల నెరవేరేలా ప్రధాన మంత్రి జన్‌జాతి ఆదివాసి న్యాయ మహాఅభియాన్ కింద గృహాలను నిర్మించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి రవీంద్రారెడ్డి తెలిపారు. గురువారం సున్నిపెంటలోని ఐటీడీఏ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి అర్హులైన వారికి గృహాలను నిర్మించేందుకు పనిచేయాలని ఆదేశించారు. శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో నంద్యాల , ప్రకాశం, పల్నాడు, జిల్లాలో నివసిస్తూ ఇళ్లులేని చెంచుగిరిజన కుటుంబాలు తమ వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. జనవరి 5వ తేది వర కు మొబైల్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెంచుగిరిజనులందరూ ఇంటి వద్దనే ఉండి, ఆధార్‌కార్డ్, రేషన్‌కార్డ్, జాబ్‌కార్డ్, ఇంటిపట్టాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఇంటిపట్టా లేని వారు తమ స్థలం హద్దులను మొబైల్‌యాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో ఎన్ఆర్‌జీఈఎస్, హౌసింగ్, వైకెపీ, ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో నైపుణ్యాలు గుర్తించడమే లక్ష్యం



వెలుగోడులో బాల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న శిల్పా భువనేశ్వర్‌రెడ్డి



నందికొట్కూరులో కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు



పగిడ్యాలలో రైడర్‌ను యాంకిల్‌హోల్డ్‌తో పట్టిన క్రీడాకారులు

వెలుగోడు: క్రీడాకారులలో దాగివున్న నైపుణ్యాన్ని గుర్తించడమే ఆడుదాం ఆంధ్ర లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో 4వ సచివాయం పరిధిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని భువనేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల జయపాల్, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే పోటీలు

నందికొట్కూరు: మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ...ఆంధ్ర పోటీలను శ్రీకారం చుట్టారని ఎంపీడీఓ శోభరాణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ షేక్షావలి అన్నారు. గురువారం పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్‌లో, ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఆడుదాం..ఆంధ్రా పోటీలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి బాలమద్దయ్య, సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, కర్నూలు జిల్లా శాప్ కో ఆర్డినేటర్ శ్రీనాథ్, గవర్నమెంట్ డిగ్రీ, జూనియర్ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్ రియాజ్‌బాషా, ఆసీఫ్‌బాషా, పీడీలు జెసింత, డోరతి, పద్మలత తదితరులు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని మల్యాల గ్రామంలో క్రికెట్ పోటీలను ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి ప్రారంభించారు. అలాగే నందికొట్కూరులోని ఇండోర్ స్టేడియంలో నాగటూరు గ్రామ క్రీడాకారుల షటిల్ బాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, పంచాయతీ కార్యదర్శి రవీంద్ర, మండల కనీ్వనర్ ఓంకార్‌రెడ్డి పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని బానుముక్కల గ్రామంలో గురువారం ఆడుదాం ఆంధ్రా కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మి ంటన్ పోటీలను ఎంపీడీఓ గోపీక్రిష్ణ ప్రారంభించారు. క్రికెట్ పోటీలను వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారిణి విమలమ్మ, పీడీలు నాగరాజు, శ్రీనివాసులు, సాయిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ, యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీఓ నూర్జహాన్, తర్తూరు సర్పంచ్ పెద్దముంతల నాగిరెడ్డి తెలిపారు. ఆడుదాం–ఆంధ్ర క్రీడల్లో భాగంగా గురువారం తర్తూరు గ్రామసచివాలయ పరిధిలో క్రికేట్ పోటీలను సర్పంచ్ రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు.

మిడుతూరు: గ్రామీణ ప్రాంత విద్యార్థులల్లో ప్రతిభ వెలికి తీసేందుకే మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కడుమూరు సర్పంచ్ జీవరత్నం అన్నారు. గురువారం మండలపరిధిలోని కడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కబడ్డీ, క్రికెట్ నిర్వహించారు.

పగిడ్యాల: మండల వ్యాప్తంగా ప్రారంభమైన ఆడుదాం.. ఆంధ్రా క్రీడా సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. కబడ్డీ, క్రికెట్, బాల్‌బాడ్మింటన్, వాలీబాల్ పోటీలలో నువ్వా నేనా అన్నట్లు క్రీడాకారులు పోటీ పడుతున్నారు. మూడవ రోజైన గురువారం నెహ్రూనగర్, పాత ముచ్చుమర్రి, పగిడ్యాల, పడమర ప్రాతకోట జిల్లా పరిషత్ పాఠశాలల్లో 16 మ్యాచ్‌లు నిర్వహించినట్లు ఎంపీడీఓ వెంకటరమణ స్పష్టం చేశారు.

కొత్తపల్లి : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా దుద్యాల, నందికుంట గ్రామాలలో జరుగుతున్న క్రీడాపోటీలను ఎంపీడీఓ మేరి సందర్శించారు. క్రీడాపోటీలలో ఎంపీడీఓ బ్యాట్ చేతపట్టి క్రికెట్, షెటిల్ క్రీడలు ఆడారు. దుద్యాల సర్పంచు చందమాల శోభలత, ఏపీఓ రేష్మ, సచివాలయ సిబ్బంది, గ్రామవలంటీర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

నందికొట్కూరు రూరల్: యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే ఐజయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో సీఎస్ఐ సంఘ పెద్దల ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా నిర్వహించిన అంతరాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కబడ్డీ ఫైనల్ పోటీల్లో గెలుపొందిన హర్యానా, తమిళనాడు జట్లకు ఆయన బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మాధవరం సుశీలమ్మ, ఉపసర్పంచ్ ఏసురత్నం, నిర్వాహకులు డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను వినియోగించుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యావ్యవస్థలో అధ్యాపకులు టెక్నాలజీని వినియోగించుకోవాలని రాయలసీమ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వై.నరసింహులు తెలిపారు. గురువారం స్థానిక శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఎన్ఈపీ–2020 పై అవగాహన కార్యక్రం డాక్టర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. నరసింహులు మాట్లాడుతూ ప్రతిభ, నైపుణ్యం ఉన్న ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలన్నారు. ప్రతి విద్యార్థి సమానమైన ప్రావీణ్యతను పొందేలా అధ్యాపకులు తమ బోధన వీడియోలను వెబ్ సైట్‌లో ఉంచాలని చెప్పారు. ప్రిన్సిపాల్ సుబ్బయ్య, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.